సాక్షి కృష్ణాజిల్లా

గురువారం ౹ 14 ౹ మార్చి ౹ 2024



స్కానింగ్ సెంటర్ల తనిఖీ

ఉయ్యూరు: లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి అన్నారు. ఉయ్యూరులో పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.



పార్టీ కార్యాలయం ప్రారంభం

పెనమలూరు: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం గంగూరులో ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ పోలీస్ కంట్రోల్‌రూం వద్ద వైఎస్సార్ పార్కులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

అనుబంధ విభాగాలకు కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని నియమించారు.

- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడుగా డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, ఉపాధ్యక్షుడుగా యాదాల శ్రీనివాసరావు, అధికార ప్రతినిధిగా షేక్ మెహ్రాజ్ నియమితులయ్యారు.
- రాష్ట్ర మహిళా విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పేరం త్రివేణిరెడ్డి, కార్యదర్శులుగా గంజినబోయిన శిరీష, పులుగు సుశీలరెడ్డి నియమితులయ్యారు.
- రాష్ట్ర కల్చరల్ వింగ్ కమిటీ కార్యదర్శిగా మద్దాలి వెంకట శివ సూర్య ప్రకాశరావు నియమితులయ్యారు.
- రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శిగా నజియాబేగం(కానూరు) నియమితులయ్యారు.

సీనియర్ నేషనల్ బాడీబిల్డింగ్ పోటీలకు ఉదయ్‌కిరణ్



పెనమలూరు: సీనియర్ నేషనల్ బాడీబిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఎస్.ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యారని రాష్ట్ర టీఏబీబీఏ అధ్యక్షుడు స్వామిరమేష్, కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు తెలిపారు. కానూరు అశోక్ జిమ్‌లో బుధవారం ఉదయ్‌కిరణ్‌కు అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వివరాలు తెలుపుతూ ఈ నెల 16,17 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో జరిగే జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు మన రాష్ట్రం నుంచి ఎస్.ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యారని తెలిపారు. అభినందన కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్ష, కార్యదర్శులు బి.మనోహర్, తాళ్లూరి అశోక్, డాక్టర్ అక్కినేని శివరామ్, బాడీ బిల్డింగ్ కోచ్‌లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ క్యాలెండర్ ఆవిష్కరించిన సజ్జల



రామవరప్పాడు(గన్నవరం): ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ క్యాలెండర్‌ను బుధవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య మాట్లాడుతూ మాటలు కాకుండా చేతల ద్వారా నాయీ బ్రాహ్మణుల అభివృద్ధిని చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మరల ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు మంగళ సూత్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం బంగారు మంగళ సూత్రాలను, గొలుసును కానుకగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఏఈవో ఎన్.రమేష్ బాబును కలిసి అమ్మవారికి 35 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బంగారు రాళ్ల గొలుసు, మంగళ సూత్రాలు, పట్టుచీరను అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఈబీసీ మహిళలకు ఆసరా

- నేడు మూడవ విడత ఈబీసీ నేస్తం నగదు విడుదల
- కృష్ణా జిల్లాలో 9,938 మందికి చేకూరనున్న లబ్ధి
- అర్హుల ఖాతాలలో రూ.15వేల చొప్పున రూ.14.90 కోట్లు జమ
- బనగానపల్లె నుంచి బటన్ నొక్కి ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- ఏడాదికి రూ.15 వేల చొప్పున రూ.45 వేలు సహాయం
- మూడు విడతలలో రూ. 47.53 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేస్తోంది. వీటితో పాటు అగ్రవర్ణాల్లో ఉన్న పేద మహిళలను కూడా ఆదుకునేందుకు ఈబీసీ నేస్తం పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రెండు విడతలు ఏడాదికి రూ.15 వేలు చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేసింది. మూడవ విడత గురువారం మరోసారి డీబీటీ ద్వారా వారి ఖాతాల్లో నగదు జమ చేయనుంది.



లబ్ధిదారులకు ఈ-బీసీ నేస్తం చెక్కును అందజేస్తున్న అప్పటి కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: అగ్రవర్ణ పేద మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు (ఈబీసీ) చెందిన స్త్రీల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. వీరి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో లబ్ధిపొందిన మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం 2021–22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించి, వరుసగా అమలు చేస్తూ వస్తోంది. వైఎస్సార్ చేయూత, కాపు నేస్తంలో ఉన్న లబ్ధిదారులతో పాటు వివిధ పథకాల కింద లబ్ధి పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఇందులో మినహాయింపు ఇచ్చారు. కేవలం బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ, వెలమ, మరాఠా, మార్వాడీ తదితర అగ్రవర్ణ కులాల్లోని పేద మహిళలకు ఈ పథకం వర్తింపజేశారు.

9,938 మందికి రూ.రూ.14.90 కోట్లు జమ:
కృష్ణాజిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 9,938 మందికి లబ్ధి చేకూరనుంది. దరఖాస్తుదారుల్లో అర్హత ఉన్న ప్రతి మహిళకు రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లోకి జమ చేయనున్నారు. దీంతో మొత్తం రూ.14.90 కోట్లు ప్రభుత్వం లబ్ధిదారులకు అందించి వారికి ఆసరాగా నిలవనుంది. ఈ నిధులతో అగ్రవర్ణ మహిళలు సైతం స్వయం ఉపాధి కింద పనులు చేసుకుంటూ వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవనున్నారు.

అతి స్వల్ప నిబంధనలు
ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అతి స్వల్ప నిబంధనలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆయా వర్గాలకు చెందిన మహిళలు 45 నుంచి 60 సంవత్సరాల లోపు వారై ఉండి, కుటుంబ నెలవారీ ఆదాయం గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు కలిగిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు ఉండి, ఏదైనా బ్యాంకులో ఖాతా కలిగి ఉంటే చాలు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడు విడతల్లో రూ.45 వేలను అందిస్తోంది.

ఇప్పటికే 21,725 మందికి ప్రయోజనం
ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంతో ఇప్పటికే జిల్లాలో 21,725 మందికి లబ్ధి చేకూరింది. మొదటి విడతలో 9,601 మందికి రూ.14.40 కోట్లు, రెండో విడతలో రూ.11,748 మందికి రూ.17.62 కోట్లు, ద్వైవార్షిక మంజూరు కింద 376 మందికి రూ.56 లక్షలు చొప్పున మొత్తం రూ.32.58 జమ చేశారు. తాజాగా మూడో విడత నిధులను సీఎం వైఎస్ జగన్ గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లోకి జమ చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	జమ చేసే మొత్తం(లక్షల్లో)
పామర్రు	1897	284.55
పెనమలూరు	2190	328.50
గన్నవరం	1785	267.75
గుడివాడ	1181	177.15
మచిలీపట్నం	1089	163.35
పెడన	471	70.65
అవనిగడ్డ	1325	198.75
మొత్తం	9938	1490.70

ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ సహాయం



అగ్రవర్ణ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ఎంతో మేలు చేస్తుంది. మూడవ విడతలో 9,938 మందికి రూ.15వేల చొప్పున మొత్తం రూ.14.90 కోట్లు సీఎం వైఎస్ జగన్ బనగానపల్లెలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఇప్పటికే ఈ పథకం కింద రెండు విడతలుగా అందుకున్న నగదుతో అనేక మంది సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

– రాజేంద్రప్రసాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ

ఆర్థికంగా అండగా ఉండేందుకే...



అగ్రవర్ణ మహిళలు సైతం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఈబీసీ నేస్తం అమలు చేస్తోంది. అర్హత ఉన్న మహిళల ఖాతాల్లోకి మూడో విడత కింద రూ.15వేలు జమ చేయనుంది.

– షేక్ షాహిద్ బాబు, సంక్షేమ శాఖల నోడల్ అధికారి, కృష్ణాజిల్లా

సీఎం జగన్ సహాయం మరువలేం



అగ్రవర్ణాల్లో కూడా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటా. నాకు రెండు విడతల్లో రూ.30 వేలు జమ అయ్యాయి.

– తటవర్తి స్వరాజ్యలక్ష్మి, లబ్ధిదారు

ప్రజా సేవలో భాగస్వాములు కావాలి

సినీ మాటల రచయిత సాయి మాధవ్



వరప్రసాద్‌కు స్వర్ణకంకణం అందిస్తున్న రమా సత్యనారాయణ, బుర్రా సాయిమాధవ్ తదితరులు

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం 13 వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ జీవీ ఎస్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్‌కు స్వర్ణకంకణ బహూకరణ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాధవ్ మాట్లాడుతూ కళాకారులను సాంస్కృతిక ప్రతినిధులుగా వర్ణించారు. విద్యావేత్త నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదిగా వరప్రసాద్ నిరంతరం ప్రజల కోసం పనిచేసేవారని, కళాకారుల కోసం తన గళం విప్పేవారన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ వరప్రసాద్ లాంటి న్యాయవాదులు సమాజానికి చాలా అవసరమన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి సత్యనారాయణరావు కళాపీఠం గౌరవ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ తదితరులు వరప్రసాద్ సామాజిక, సాంస్కృతిక సేవలను వివరించారు. అనంతరం నిర్వాహకులు వరప్రసాద్‌కు స్వర్ణకంకణం బహూకరించారు. సినీ సంగీత విభావరిలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు మధుర గీతాలను ఆలపించారు.

రామాయణంతో కీర్తి గడించిన మొల్లమాంబ

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

చిలకలపూడి(మచిలీపట్నం): మొల్ల రామాయణంతో కీర్తి గడించిన మహనీయురాలు ఆతుకూరి మొల్లమాంబ అని కలెక్టర్ పి.రాజాబాబు కొనియాడారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం కలెక్టర్ చాంబర్ వద్ద మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొల్లమాంబ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకొంటున్నామని చెప్పారు. కడప జిల్లా బద్వేల్ పట్టణానికి సమీపంలోని గోపవరంలో జన్మించిన మొల్లమాంబ తొలి తెలుగు మహిళా కవయిత్రిగా పేరు గడించారన్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం ఇతర రామాయణాలతో పోలిస్తే చాలా సరళమైనదని, సామాన్య ప్రజానీకానికి సైతం ఎంతో అర్థమయ్యే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి జి.రమేష్, సహాయ సంక్షేమాధికారులు వై.ఇందిర, ఎ.దివ్య, విజయకుమార్, కుమ్మరి, శాలివాహన సంఘం నాయకులు అంబటి బసవశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్‌బాట్ సేవలు వినియోగించుకోండి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను వాటి సొంతదారులకు అందజేస్తున్న డీసీపీలు రాణా, శ్రీనివాసరావు

- రూ.కోటి విలువైన మొబైల్స్ రికవరీ
- ఫోన్ పోతే వెంటనే 94406 27057కు హాయ్ మెసేజ్ పెట్టండి
- డీసీపీలు ఎ.ఎస్.రాణా, కె.శ్రీనివాసరావు

విజయవాడస్పోర్ట్స్: బాధ్యతాయుతమైన స్నేహపూర్వక పోలీసింగ్ విధానాన్ని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అవలంబిస్తుందని డెప్యూటీ పోలీస్ కమిషనర్‌లు అధిరాజ్ సింగ్ రాణా, కంచి శ్రీనివాసరావు తెలిపారు. గడిచిన ఆరు నెలల కాలంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను చాట్‌బాట్ ద్వారా రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్‌లను కమాండ్ కంట్రోల్ రూంలో వాటి యజమానులకు బుధవారం అప్పగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది జూన్ ఆరో తేదీన చాట్‌బాట్ సేవలను జిల్లాలో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే 300 ఫోన్‌లను రికవరీ చేసి వాటి యజమానులకు అందజేశామన్నారు. ప్రస్తుతం రూ.కోటి విలువ చేసే 628 ఫోన్‌లను రికవరీ చేసినట్లు చెప్పారు. ఫోన్ పోగొట్టుకున్న వెంటనే అధైర్య పడకుండా పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని కోరారు. 94406 27057కు హాయ్ అని మెసేజ్ పంపితే వెంటనే గూగుల్ పేజీ లింక్ ఓపెన్ అవుతుందని, ఆ లింక్ క్లిక్ చేసి పోయిన మొబైల్ ఫోన్ వివరాలను నమోదు చేస్తే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పోయిన ఫోన్‌ను గుర్తిస్తామన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు సూచించారు. ఫోన్‌లను దొంగిలించిన వ్యక్తులే అత్యధికంగా అమ్మేందుకు ప్రయత్నిస్తారనే విషయం గుర్తించాలన్నారు. దొంగిలించిన ఫోన్ కొనుగోలు చేస్తే శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చాట్‌బాట్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేసిన సైబర్ క్రైం ఏసీపీ ఎస్.డి.తేజేశ్వర్, సీఐ కోమాకుల శివాజీ, సిబ్బందిని డీసీపీలు ప్రత్యేకంగా అభినందించారు.

దుర్గమ్మ సేవలో మంత్రి రోజా దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రోజా దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రోజా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

అపరాల రైతు..ఆనందాల జోరు

- అనుకూలించిన వాతావరణం
- ఆశాజనకంగా దిగుబడులు
- బహిరంగ మార్కెట్‌లో అపరాలకు మంచి ధర
- ముమ్మరంగా మినుము, పెసర తీత పనులు



తీత పనుల్లో నిమగ్నమైన కూలీలు

కంకిపాడు: అపరాల రైతుకు వాతావరణం అనుకూలించింది. సాగు ఆరంభంలో తుపానుతో స్వల్ప నష్టం వాటిల్లినా ప్రభుత్వ చొరవతో సకాలంలో విత్తనాలు అందటంతో సాగుకు ఉపక్రమించారు. పంటచేతికి రావటంతో మినుము, పెసర తీత, నూర్పిడి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆశించిన దిగుబడులు దక్కాయి. మార్కెట్‌లో ధరలు కూడా లాభదాయకంగా ఉండటంతో అపరాల రైతు మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది.

కృష్ణాజిల్లాలో సాగు ఇలా...
2023–24 రబీ సీజన్‌కు కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లోనూ 1,04,333 హెక్టార్లలో మినుము, 3,907 హెక్టార్లలో పెసర సాగయ్యాయి. వీటితో పాటుగా ప్రధానంగా శనగ 25 హెక్టార్లు, వేరుశనగ 736 హెక్టార్లలో సాగు చేశారు. సాగు మొదట్లో మిచాంగ్ తుపాను విరుచుకుపడి వరి కోతలు పూర్తయి మినుము, పెసర విత్తులు చల్లిన పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. అయితే ప్రభుత్వం వెంటనే రాయితీపై విత్తనాలను సరఫరా చేయటంతో రైతులు సాగు చేపట్టారు.

వాతావరణం అనుకూలించడంతో...
ఈ సీజన్ అపరాల రైతుకు కలిసొచ్చింది. వాతావరణం పూర్తిగా అనుకూలించింది. తెగుళ్ల బెడద లేకపోవటంతో పైరు ఎదుగుదల బాగుంది. ఎకరాకు ఒక్కో రైతు రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి రావటంతో మినుము, పెసర తీత పనులు చేపడుతున్నారు. తీత పూర్తిని పొలాల్లో మినుము/పెసర ఎండిన తరువాత గూళ్లు కట్టి నూర్పిడికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో నూర్పిడి పనులు కూడా సాగుతున్నాయి.

దిగుబడులు..ధర...రెండూ సూపర్
వరుసగా ఈ ఏడాది కూడా అపరాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. మాగాణి పొలాల్లో ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి లభిస్తోంది. సస్యరక్షణ ప్రాధాన్యతను బట్టి అదనంగా మరో మూడు క్వింటాళ్లు కూడా లభిస్తున్న పరిస్థితి. మెట్ట పొలాల్లో అయితే 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి చేతికి అందుతోంది. వ్యవసాయ శాఖ ఎకరాకు 7 క్వింటాలు దిగుబడి వస్తుందని ప్రాథమికంగా అంచనా వేసింది. ప్రస్తుత దిగుబడులు అంచనాలకు మించి ఉన్నాయి. మద్దతు ధర మినుము క్వింటా రూ.6950, పెసలు రూ.8558గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మార్కెట్‌లో ధరలు మద్దతు ధరకు మించి పలుకుతున్నాయి. మినుము క్వింటా రూ.9400 నుంచి రూ 9700కు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. పెసలు క్వింటా రూ.9 వేలు పలుకుతోంది. ఈ ఏడాది మినుము ధరలు ఊహించని విధంగా రూ.11 వేల వరకూ చేరే అవకాశం ఉండటంతో రైతులు పంటను నిల్వ చేసుకుని మంచి ధర కోసం వేచిచూస్తున్నారు.



మినుము జల్లెడ పడుతున్న కూలీలు

పెరిగిన మినుము సాగు...
గతేడాదితో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో మినుము సాగు విస్తీర్ణం పెరిగింది. గత రబీలో 1,02,118 హెక్టార్లలో మినుము సాగయింది. ఈ సీజన్‌లో మాత్రం ఒడుదొడుకులు ఎదురైనా ప్రభుత్వం 80 శాతం రాయితీపై విత్తనాలను సమకూర్చటంతో 1,04,333 హెక్టార్లలో సాగు జరిగింది. పెసర మాత్రం గత సీజన్‌లో 4,102 హెక్టార్లలో సాగు జరిగితే ఈ ఏడాది స్వల్పంగా సాగు విస్తీర్ణం తగ్గి 3,907 హెక్టార్లలో సాగు చేపట్టారు.

మార్కెట్‌లో మంచి ధర ఉంది



ఈ సీజన్‌లో మినుము పంట బాగుంది. మార్కెట్‌లో రేటు కూడా బాగానే ఉంది. మాకు సొంతం ఏడెకరాలు ఉంది. మరో 13 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాం. కౌలు ఏడాదికి 19 బస్తాలు చొప్పున ఇస్తున్నాం. మినుము పంట 8 బస్తాల నుంచి 10 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. క్వింటా రూ.9 వేలు పైనే పలుకుతోంది. మంచి రేటు చేతికి వస్తుంది.

–బర్మా రాంబాబు, రైతు, చాగంటిపాడు, ఉంగుటూరు మండలం

దిగుబడులు బాగున్నాయి



వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉంది. తెగుళ్ల బెడద లేదు. సస్యరక్షణకు ఎక్కువ ఖర్చు అయింది. ఎకరాకు రూ.25 వేలు పైగా పెట్టుబడి అయ్యింది. దిగుబడి బాగానే వచ్చింది. ఎకరాకు 7, 8 క్వింటాళ్లకు పైగా వచ్చాయి. బయట మార్కెట్‌లో రేటు బాగుంది. క్వింటా రూ.9300 అంటున్నారు. ఈ సీజన్ లాభదాయకమే.

–ఆరేపల్లి నాగరాజు, కౌలురైతు, ప్రొద్దుటూరు, కంకిపాడు మండలం

గీతాంజలికి కొవ్వొత్తులతో నివాళి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం పార్టీ, జనసేన శ్రేణుల ట్రోలింగ్స్ కారణంగా బీసీ యువతి గీతాంజలి బలైందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపులకు నిరసనగా, ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలికి నివాళి అర్పిస్తూ బుధవారం రాత్రి విజయవాడ రాజా కుమారి థియేటర్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ శ్రేణులు హాజరై గీతాంజలికి నివాళులర్పించారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో ప్రజలు ఆనందంగా ఉంటే చూసి ఓర్వలేక లేక అడ్డగోలుగా ట్రోల్ చేస్తున్నారన్నారు. ఇటువంటి దారుణాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బండి పుణ్యశీల, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శనలో షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

క్లుప్తంగా

జీవ వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణం, జీవ వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విజయవాడ నగరానికి చెందిన చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ 'పిచ్చుకను చేసుకుందామా మచ్చిక' అనే నినాదంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంస్థల సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సేవ్ స్పారో ఆర్ట్ కాంటెస్ట్ పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిచ్చుకల మనుగడకు కొన్నేళ్లుగా స్ఫూర్తి శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 20వ తేదీ ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సేవ్ స్పారో నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంటెస్ట్‌లో విద్యార్థులు, చిత్రకారులు పాల్గొనాలన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉమెన్ వింగ్ ఇన్‌చార్జి సంధ్యారాణి, వర్కింగ్ కమిటీ మెంబర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' జాతీయస్థాయికి ఇరువురు విద్యార్థినులు



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రస్థాయిలో ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు కృష్ణా జిల్లా విద్యార్థినులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు డీఈవో తాహెరాసుల్తానా బుధవారం తెలిపారు. మార్చి 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణాజిల్లాలోని గూడూరు మండలం తరకటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోట నిహారిక ఇన్నోవేటివ్ డ్రైయిన్ స్పేడ్ ప్రాజెక్టును తయారుచేసింది. బందరు మండలం గుండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మంజే దుర్గాసాయి రైతులకు, వ్యవసాయానికి పనికొచ్చే వినూత్నమైన జల్లెడను తయారుచేసి జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. వీరిని డీఈవోతో పాటు జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్ అభినందించారు.

ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



కృష్ణా వర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ నయీమ్ అస్మి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): త్వరలో జరగబోయే ఎన్నికలకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రంలో మూడంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, రిటర్నింగ్ అధికారులతో కలిసి విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఓట్ల లెక్కింపుకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై ఎన్నికల అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు కృష్ణా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు రూములు, పరిశీలకుల గదులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ హాళ్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీతో చర్చించారు.

ఏడు నియోజకవర్గాల లెక్కింపు ఇక్కడే..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. అందుకోసం సెగ్మెంట్ల వారీగా పార్లమెంటు, అసెంబ్లీ ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు రూములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 300 మీటర్ల పరిధిలో ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. 24 గంటలు భద్రత కల్పించేందుకు మూడు షిఫ్టులలో సెక్యూరిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్ఓ కె. చంద్రశేఖర రావు, పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో డి. రాజు, గుడివాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో పద్మావతి, మచిలీపట్నం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో ఎం. వాణి, పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముడా వీసీ పి. వెంకటరమణ, పామర్రు రిటర్నింగ్ అధికారి కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, అవనిగడ్డ రిటర్నింగ్ అధికారి గుడివాడ మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వర్ రావు, ఏఆర్ఏఎస్‌సీఎస్ వీడీ ప్రసాద్, కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి జి. జ్ఞానమణి, రిజిస్ట్రార్ శోభన్ బాబు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ



లబ్ధిదారులకు రుణ మంజూరు చెక్కును అందజేస్తున్న జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే) ద్వారా సఫాయీ మిత్రలకు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ రుణ మంజూరు పత్రాలు, ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, పారిశుద్ధ్య కార్మిక వర్గాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో బుధవారం న్యూఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో సంభాషించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ కన్వెన్షన్‌హాలులో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఇతర అధికారులతో కలిసి వీక్షించారు. దేశంలో అణగారిన వర్గాలకు నిర్దేశించిన ప్రధానమంత్రి సామాజిక్ ఉత్థాన్ ఏవం రోజ్‌గార్ ఆధారిత్ జనకల్యాణ్ (పీఎంసురాజ్) పోర్టల్‌ను పీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహిద్‌బాబు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. రాజేంద్ర బాబు, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, పీఎంయూ స్టేట్ కో–ఆర్డినేటర్ అతుల్య, శ్రీనిధి ఏజీఎం శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 5,415 ఓటరు క్లెయిమ్ ఫారాలను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజాబాబు అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియలోని పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫారం-6, 7, 8 కు సంబంధించి 5,415 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏడు రోజులకు మించి ఉన్న దరఖాస్తులు 1,792 ఉన్నాయని వాటిలో 1,100 దరఖాస్తులు ఫారం-7కు సంబంధించినవి అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపామని వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాపై తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని వాటిలో ఆరు ఫిర్యాదులను ఇప్పటికే పరిష్కరించామని మిగిలిన మూడు ఫిర్యాదులు విచారణలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఎస్పీ నయీమ్ అస్మి, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

కొత్త ఊళ్లు నిర్మించిన నాయకుడు సీఎం జగన్

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



మాట్లాడుతున్న కొడాలి నాని

గుడివాడ టౌన్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన చేస్తున్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని జగనన్న కాలనీలో బుధవారం రూ. 4.50 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు గుడివాడ అభివృద్ధికి కొడాలి నాని ఏం చేశాడు అని ప్రశ్నించడం వారి అవివేకం అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 74 ఎకరాలు కొనుగోలు చేశారని, వీటిలో టిడ్కో ఇళ్లు నిర్మించగా.. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 180 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. వాటిలో 3 వేలు పైబడి ఇళ్ల నిర్మాణానికి మెరక తోలకం, రోడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. గుడివాడ నియోజకవర్గం ప్రజల సంక్షేమం కొరకుగాని ఇళ్ల నిర్మాణం కోసం గాని చంద్రబాబు నాయుడు ఒక్క ఎకరం పొలం కొన్నారా? అని ప్రశ్నించారు. గుడివాడ టీడీపీ అడ్డా, మా మామగారి నియోజకవర్గమని కబుర్లు చెప్పిన చంద్రబాబు పేదల కోసం ఒక ఎకరా భూమి ఎందుకు కొనలేదని ప్రశ్నించారు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే గుడివాడ ప్రజల చిరకాల వాంఛ అయిన ఫ్లైఓవర్ 3 కిలోమీటర్ల పొడవునా రూ. 320 కోట్లతో నిర్మాణానికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే పనులు ప్రారంభమయ్యాయన్నారు. త్వరలోనే దానిని పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తారన్నారు. తమ పాలనలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలో, టిడ్కో ఇళ్లలో మొత్తం 45 వేల మంది నివాసానికి ఏర్పాట్లు చేశామని ఇది ఒక కొత్త టౌన్‌షిప్ అన్నారు.

ఆర్టీసీ ఎండీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

విజయవాడస్పోర్ట్స్: ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమల రావుకు సైబర్ నేరగాళ్లు వల వేశారు. ఆయన పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్‌ను సృష్టించి సైబర్ నేరాలకు వినియోగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన యూనిఫాంలో ఉన్న ఫొటోతో అకౌంట్‌ను క్రియేట్ చేసి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపారు. ఈ అకౌంట్‌ను ఉపయోగించి ఆయన స్నేహితులు, సహోద్యోగులు, బంధువుల నుంచి డబ్బులు గుంజేందుకు నేరగాళ్లు చేస్తున్న ప్రయత్నాన్ని ముందుగానే ఎండీ తిరుమలరావు పసిగట్టారు. వెంటనే విజయవాడ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు ఎలాంటి ఫేస్‌బుక్ అకౌంట్ లేదని స్నేహితులకు, సన్నిహితులకు, సహోద్యోగులకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. ఎండీ తిరుమలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సైబర్ సీఐ కోమాకుల శివాజీ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

జి.కొండూరు: పొట్టకూటి కోసం రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముకుంటున్న వ్యక్తి పైకి కారు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. ఎ. కొండూరు మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన తుళ్లూరి వెంకటేశ్వరరావు(55)కి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసిన వెంకటేశ్వరరావు, చిరు వ్యాపారాలు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల శివారులోని జాతీయ రహదారి పక్కన తాటి ముంజలను అమ్ముతున్నాడు. కాగా బుధవారం సాయంత్రం విజయవాడ వైపు నుంచి మైలవరం వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి వెంకటేశ్వరరావుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పన్నెండు గంటల్లోనే చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ హరికృష్ణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిని పోలీసులు పన్నెండు గంటల వ్యవధిలోనే అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ హరికృష్ణ వివరాలు వెల్లడించారు. సత్యనారాయణపురం శివరావు వీధిలో చైతన్య కళాశాల ఎదురుగా నివాసముండే పోలూరు దుర్గాభవానీ మంగళవారం రాత్రి 10.30 గంటల సమీపంలోని హోటల్ నుంచి టిఫిన్ తీసుకుని ఇంట్లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా, సుమారు 40ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఆమె వెనుక నుంచి వెళ్లి మెడలోని 18 గ్రాముల బంగారు నానుతాడు తెంచుకుని సమీపంలోనే పార్కు చేసిన ఆటోలో పరారయ్యాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఘటనాస్థలానికి చేరుకుని నేరం జరిగిన తీరు, క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి స్నాచింగ్‌కు పాల్పడింది కొత్త ఆర్ఆర్‌పేటకు చెందిన బెజ్జం చందుగా గుర్తించి గాలింపు చేపట్టారు. నిందితుడు కాళేశ్వరరావు మార్కెట్ వద్ద సంచరిస్తున్నట్లు సమాచారం రావటంతో అరెస్టు చేసి అతని వద్ద నుంచి స్నాచింగ్‌కు పాల్పడిన బంగారు నానుతాడు, ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో నార్త్‌జోన్ ఏసీపీ డి.ప్రసాద్, ఎస్ఎన్‌పురం సీఐ వెంకట నారాయణ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో వివాహిత ఆత్మహత్య

రెడ్డిగూడెం: భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న నేపథ్యంలో ఏడాది కాలం నుంచి ఒంటరిగా ఉంటున్న వివాహిత బుధవారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన ఎస్సీకాలనీ నందు బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిగూడెం ఎస్సీ కాలనీ సీఎస్ఐ చర్చి సమీపంలో నివాసం ఉంటున్న నటక రాణీ శ్రీలక్ష్మి(30), భర్త వెంకయ్య గత ఏడాది క్రితం భార్య శ్రీలక్ష్మిని వదిలిపెట్టి వేరొక మహిళతో సహజీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీలక్ష్మికి ఉన్న ఇద్దరు పిల్లలు కూడా భర్త వెంకయ్య వద్దే ఉంటున్నారు. శ్రీలక్ష్మి ఒంటరిగా జీవితాన్ని కొనసాగిస్తోంది. ఈ క్రమంలో బుధవారం శ్రీలక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామ రెవెన్యూ అధికారి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని బైకర్ మృతి

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో కేసీపీ సుగర్స్ కర్మాగారం సమీపంలో ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం బందరు సమీపంలోని చిలకలపూడికి చెందిన ఎస్.నాగశ్రీను అనే వ్యక్తి చల్లపల్లి వైపు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా మచిలీపట్నం వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో నాగశ్రీనుకు తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘంటసాల 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ప్రాథమిక చికిత్స అందించి మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో అత్యవసర చికిత్స కూడా అందించారు. నాగశ్రీను పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈలోపే నాగశ్రీను మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.పొన్నవరం గ్రామానికి చెందిన మార్కపూడి నాగరాజు(38) మండల కేంద్రం పెనుగంచిప్రోలు పని మీద వెళ్లి తిరిగి వస్తుండగా కుక్కలు అడ్డు రావటంతో బైక్‌పై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పరామర్శించి, ఓదార్చారు.